
సాక్షి విశాఖపట్నం

శనివారం । 15 । మార్చి । 2025



హోలీ.. జోష్ హైలీ..







ఆనందపు రంగులను మొహానికి పూసుకున్నారు, అందమైన క్షణాలను, జ్ఞాపకాలుగా నిక్షిప్తం చేసుకున్నారు. సప్తవర్ణాల చిరు జల్లుల్లో తడిసి ముద్దయ్యారు. ఆత్మీయులతో ప్రేమానుబంధాలు వసంతంగా వికసించేలా హోలీ జరుపుకున్నారు. విశాఖలోని సాగరతీరాల్లో హోలీ జోష్ కనిపించింది. ప్రముఖ హోటళ్లలో హోలీ సందర్భంగా రెయిన్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేశారు. కురుసుర మ్యూజియం పక్కనే ఏర్పాటు చేసిన రెయిన్ డ్యాన్స్ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో యువత పాల్గొని రంగులు పూసుకుంటూ జోష్ నింపారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో అపార్ట్‌మెంట్ వాసులు హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కిలో అంటే 900 గ్రాములే..!

సాధారణంగా ఒక కేజీకి ఎన్ని గ్రాములు అంటే.. ఠక్కున 1000 గ్రాములు అని చెప్పేస్తాం. కానీ ఇక్కడ లెక్కలు మారిపోయాయి. కేజీ అంటే 900 గ్రాములు..అంతకంటే తక్కువేనంటూ కొత్త భాష్యం చెబుతున్నారు కొందరు వ్యాపారులు. నమ్మట్లేదా.? ఇది పచ్చి నిజం..

– సాక్షి, విశాఖపట్నం/దాబాగార్డెన్స్/ఆరిలోవ/తాటిచెట్లపాలెం

మహారాణిపేటకు చెందిన రాజేశ్వరి పూర్ణామా ర్కెట్‌కు వెళ్లి కేజీ వెల్లుల్లి కొన్నారు.



ఎందుకైనా మంచిది అని కొంత దూరంలో ఉన్న ఓ దుకాణం దగ్గరికి వెళ్లి.. ఎలక్ట్రానిక్ మెషీన్‌లో తూకం చూసుకుంటే 890 గ్రాములు మాత్రమే చూపించింది.





ప్రతి వెయింగ్ మెషీన్‌కీ ఈ సీల్ తప్పనిసరి

జిల్లాలో వ్యాపారుల దోపిడీ పర్వం

- దాడులు జరుగుతున్నా దోచుకుంటున్నారు
- పలు సూపర్ మార్కెట్లలో లేబుల్స్ లేకుండానే విక్రయాలు
- అడుగడుగునా మోసపోతున్న వినియోగదారుడు
- హక్కుల కోసం నిరంతర పోరాటం
- అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల హక్కుల మండలి




ఆరిలోవ టీఐసీ పాయింట్‌కు చెందిన కూరగాయల వ్యాపారి దగ్గర కిలో క్యారెట్ కొనుగోలు చేశారు. అనుమానం వచ్చి పక్కన ఉన్న పండ్ల దుకాణంలో తూకం వేయిస్తే 740 గ్రాములు మాత్రమే కనిపించింది. ఇక్కడ రెండూ ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్లే కావడం గమనార్హం.

ఉమ్మడి విశాఖ జిల్లాలో లీగల్ మెట్రాలజీ శాఖ కేసుల వివరాలు

తూనికలు, కొలతల కేసులు	ప్యాకేజీ కమోడిటీస్ కేసులు	మొత్తం కేసులు
1,202	1,025	2,227

విధించిన స్టాంపింగ్ ఫీజ్	కాంపౌండింగ్ ఫీజు
రూ. 2,98,47,964	రూ. 1,48,77,300

మోసాన్ని తూకమేస్తున్నారు..!

జిల్లాలో ఎక్కడ చూసినా.. ఏదో ఒక చోట తూనికలు, కొలతల మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఓవైపు అడపాదడపా దాడులు జరుగుతున్నా.. వ్యాపారులు మాత్రం తమ హస్తలాఘవాన్ని చూపిస్తూనే ఉన్నారు. పండ్లు, కూరగాయలు, కిరాణా సరుకుల విక్రయాల్లో కొనుగోలుదారులు మోసపోవడం పరిపాటిగా మారిపోయింది. మెషీన్లకు వేసిన సీళ్లు వేసినట్లే ఉంటున్నాయి. కానీ మోసం మాత్రం జరుగుతూనే ఉంది. దీంతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. పలు రైతు బజార్లలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ప్యాకింగ్‌లోనూ మోసాలు



ఇక సూపర్ మార్కెట్లలోనూ మోసాలు జోరందుకుంటున్నాయి. ప్యాకింగ్ చేసి సొంత స్టిక్కర్లు వేసి విక్రయాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. సూపర్ మార్కెట్‌లో అక్కడ తూకం వేసి చూసుకునేందుకు యంత్రాలు ఏర్పాటు చెయ్యాలి. కానీ ఏ సూపర్ మార్కెట్‌లోనూ ఇవి కనిపించడంలేదు. అంతేకాదు ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్న పదార్థాలపై ఎప్పుడు తయారు చేశారు. ఎంత బరువు ఉంది. ఎక్స్‌పైరీ డేట్ ఎప్పటి వరకూ ఉంటుందనే విషయాలు కూడా ముద్రించడం లేదు. ఎంవీపీ కాలనీలోని విశాఖ సూపర్ మార్కెట్‌లో ఇదే జరుగుతోంది. ఫ్రెంచ్‌ఫ్రైస్‌ని తమ సొంత ప్యాకింగ్‌లలో విక్రయిస్తున్నారు. కానీ దానిపై ఎంఎఫ్‌జీ డేట్, ఎక్స్‌పైరీ డేట్ కూడా లేదు. అదేవిధంగా తినుబండారాలపై కేవలం ధర స్టిక్కర్ మాత్రమే అతికించి అమ్మేస్తున్నారు. దానిపై ఎక్కడ తయారు చేశారు.? ఏఏ పదార్థాలతో తయారు చేశారన్న వివరాలూ కనిపించడం లేదు. కేవలం ఈ ఒక్క సూపర్ మార్కెట్ లోనే కాదు.. నగరంలో ఉన్న సగానికిపైగా సూపర్ మార్కెట్‌లు నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

దాడులు జరుగుతున్నా తూకంలో మోసాలెందుకు?

రాష్ట్ర తూనికలు కొలతల శాఖ నిరంతరం దాడులు నిర్వహిస్తోంది. కానీ వినియోగదారులు ఏదో ఒక చోట మోసపోతూనే ఉన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం.. అడపాదడపా దాడులు చేస్తూ.. వెయింగ్ మెషీన్లకు సీల్ ఉందా.? సాంకేతికంగా ఏమైనా మోసాలకు పాల్పడుతున్నారా లేదా అని చెక్ చేస్తూ.. మోసం చేస్తున్న వ్యాపారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. 2023–24లో ఇప్పటి వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,227 కేసులను వ్యాపారులపై నమోదు చేశారు. బరువు తూచే యంత్రాల తయారీ, మరమ్మతు, యంత్రాలు సరిచూసి అధికారుల ఆమోదంతో ధ్రువీకరించేందుకు కొందరికి తూనికలు, కొలతల శాఖ అనుమతులిస్తుంది. అవి పొందిన లైసెన్స్‌దారులు ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు బరువు తూచే యంత్రాల్ని ఏటా మరమ్మతు చేసి తనిఖీ అధికారి ద్వారా ధ్రువీకరించి వ్యాపారికి ధ్రువపత్రం ఇవ్వాలి. అంతా సక్రమంగా ఉంటేనే సీల్ వేస్తారు. అయినా వ్యాపారి మోసానికి పాల్పడితే వ్యాపారిపై చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి తయారీదారుడూ వినియోగదారుడే..



వ్యాపారులు కొనుగోలుదారుల్ని మోసం చేస్తున్నామని అనుకుంటున్నారు. కానీ.. ప్రతి వ్యాపారీ, తయారీ దారుడు కూడా వినియోగదారుడే అన్న విషయాన్ని గుర్తించుకోవాలి. వినియోగదారుల హక్కుల చట్టం మరింత బలోపేతమయ్యింది. ఎక్కడ మోస పోయినా.. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తున్నాం. విజయం సాధిస్తున్నాం. విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వ సహకారంతో పాఠశాలల్లో కన్స్యూమర్ రైట్స్ క్లబ్ (సీఆర్‌సీ)లు ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో ఈ క్లబ్‌లు విస్తృతంగా పనిచేస్తున్నాయి.

– బాలకృష్ణ, కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధికార ప్రతినిధి

'సాక్షి'తో వినియోగదారుల హక్కుల మండలి..



ఎంవీపీ రైతుబజారులో వినియోగదారుల మండలి తనిఖీలు

వినియోగదారుడు మోసపోకుండా ప్రతి దుకాణం కన్స్యూమర్ రైట్స్ నిబంధనల్ని తూచా తప్పకుండా పాటించాలంటూ జాతీయ వినియోగదారుల హక్కుల మండలితో కలిసి 'సాక్షి' బృందం.. ప్రజల్లోనూ, వ్యాపారుల్లోనూ చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డా.వికాస్‌పాండే, జాతీయ అధికారప్రతినిధి బాలకృష్ణతో కూడిన బృందంతో కలిసి పలు దుకాణాలకు, సూపర్ మార్కెట్‌లకు వెళ్లి.. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న విక్రయాలను వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నిబంధనలకు అనుగుణంగా ప్యాకింగ్, తూనికలు సరిచేసుకోవాలని సూచించారు.

మోసం జరిగితే ధైర్యంగా ఫిర్యాదు చెయ్యాలి



వినియోగదారుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి. అప్పుడే వ్యాపారుల్లో మోసపూరిత ధోరణులు మారతాయి. వస్తువు కొనుగోలు చేసే సమయంలో తూకాలను నిశితంగా గమనించాలి. మోసాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే తూనికలు, కొలతల శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1967, లేదా 0891-27995511 నంబర్‌కి ఫోన్ చేసి ధైర్యంగా ఫిర్యాదు చెయ్యండి. ప్రజలు కూడా ఏదైనా వస్తువు కొనే ముందు కొలతలు సరిగా చేస్తున్నారా లేదా గమనించడం అలవాటు చేసుకోవాలి.

– కె.థామస్ రవికుమార్, ఏపీ లీగల్ మెట్రాలజీ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కంట్రోలర్

నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచలేరు



ధర్నాలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నేతలు

- ఉక్కు కార్మిక సంఘాల హెచ్చరిక
- విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూర్మన్నపాలెం వద్ద ధర్నా
- గాజువాకలో ధర్నా అడ్డుకోవడంపై ధ్వజం

కూర్మన్నపాలెం: నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచలేరని ఉక్కు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం శాంతియుతంగా పోరాటాలు చేస్తుంటే.. వాటిని విఫలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేయడం మంచి పరిణామం కాదని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూర్మన్నపాలెం దీక్ష శిబిరం వద్ద కార్మిక సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పాత గాజువాకలో ధర్నా నిర్వహించాలని ముందుగా నిర్ణయించి, అనుమతి కూడా తీసుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం కుటిల రాజకీయం చేసిందని ఆరోపించారు. ధర్నాకు పిలుపునిచ్చిన నేతలను పోలీసుల ద్వారా నిర్బంధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది నాయకులను స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఉదయాన్నే అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ విషయం నగర పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రభుత్వ అడ్డంకుల మధ్య చివరకు కూర్మన్నపాలెం జంక్షన్‌లో దీక్ష శిబిరం వద్దే ధర్నా చేసినట్లు నాయకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ వల్ల ఉక్కు కర్మాగారానికి పైసా ప్రయోజనం కలగలేదని తేల్చి చెప్పారు. కనీసం ప్లాంట్ అభివృద్ధికి గాని, ఉపాధి కల్పనకు గాని, ఉత్పత్తి వ్యయానికి గాని, కనీసం కార్మికుల వేతనాలు చెల్లింపునకు గాని ప్యాకేజీ దోహదపడలేదన్నారు. ధర్నాలో 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, పోరాట కమిటీ చైర్మన్ బి.ఆదినారాయణ, హెచ్ఎంఎస్ నాయకులు గణపతిరెడ్డి, సీఐటీయూ నేత ఎన్.రామారావు, సన్యాసిరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు రామచంద్రరావు, మద్ది అప్పలరాజు రెడ్డి, వరసాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పల్లా చినతల్లి తదితరులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలన్నారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా ఏసీపీ త్రినాథ్ నేతృత్వంలో సీఐలు మల్లేశ్వరరావు, కేశవరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మోహరించిన పోలీసులు

ఉక్కు కార్మిక నాయకుల నిర్బంధం

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో శుక్రవారం ధర్నా తలపెట్టిన కార్మిక సంఘాల నాయకులను స్టీల్‌ప్లాంట్ పోలీసులు నిర్బంధించారు. పాతగాజువాక జంక్షన్‌లో ధర్నాకు అనుమతి లేదని పేర్కొంటూ నాయకులను స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్బంధించిన వారిలో నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, రామస్వామి, సుబ్బయ్య, పల్లా పెంటారావు, కామేశ్వరరావు తదితరులున్నారు.



స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఉక్కు కార్మిక నాయకులు

స్థానికులకు ఉపాధి కరువు



కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల స్థానికులకు ఉపాధి మృగ్యమైపోయింది. అన్ని రకాల పనులు జిందాల్, మిట్టల్ కంపెనీలకు అప్పగించే కుట్ర జరుగుతోంది. దీని వల్ల రాష్ట్ర ప్రజలు అన్యాయమైపోతారు. కర్మాగారానికి పూర్తి స్థాయి సీఎండీని కూడా నియమించడం లేదు. సంబంధం లేని వ్యక్తిని ఇన్‌చార్జి సీఎండీగా నియమించి.. కర్మాగారాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు.

–డి.ఆదినారాయణ, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

ఉద్యోగులను తొలగించేస్తున్నారు



ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విషయాలలోనూ అణచివేతకు గురిచేస్తున్నాయి. అందువల్లే కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఇప్పటికే వందలాది మందిని స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా ఇంటి దారి పట్టించారు. ఇంకా కాంట్రాక్టు, శాశ్వత ఉద్యోగులను అనేక రూపాల్లో తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– జి.గణపతిరెడ్డి, ఉక్కు హెచ్.ఎం.ఎస్. ప్రధాన కార్యదర్శి

ప్యాకేజీతో ప్రయోజనం లేదు



కేంద్రం ప్రకటించిన ప్యాకేజీని కర్మాగార అవసరాలకు ఉపయోగించకూడదు. ప్యాకేజీ లో విడుదలైన రూ.8,423 కోట్ల ను బ్యాంకు అప్పులకే చెల్లించారు. మిగిలిన రూ.3,017 కోట్లను నాలుగు దఫాలుగా చెల్లిస్తామన్నారు. దీని వల్ల ఎవరికీ ప్రయోజనం లేదు.

– ప్రసాద్, ఉక్కు సీఐటీయూ నాయకులు

పోరాటాలతోనే మనుగడ



ఉన్నత స్థాయిలో పోరాటం చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉద్యమాలను అణచివేయడానికి ప్రభుత్వాలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటిని ఎదుర్కొంటూ ముందుకు సాగినప్పుడే కర్మాగారాన్ని రక్షించుకోగలం.

– వరసాల శ్రీనివాసరావు, కార్మికనేత

ఫిర్యాదు చేస్తే 90 రోజుల్లో పరిష్కారం



సాక్షి ఇంటర్వ్యూ 8లో

మోసపోయారా? మేం పోరాడతాం



ఎర్ర సముద్రం



సముద్రం ఎర్రబడింది. హోలీ రంగుల్లో కలర్‌ఫుల్‌గా దర్శనమిచ్చింది. హోలీ సందర్భంగా శుక్రవారం భారీగా సందర్శకులు బీచ్‌లో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సముద్ర స్నానాలు ఆచరించారు. రంగులు పులుముకున్నవాళ్లంతా సముద్ర స్నానాలు చేయడంతో ఇలా సంద్రం ఎర్రబడింది. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గోరింటాకెట్టుకున్న సందమామవే..



హోలీ పండగ రోజున ఆకాశంలో ఒక అద్భుతం చోటు చేసుకుంది. బ్లడ్ మూన్ అని పిలవబడే చంద్ర గ్రహణం శుక్రవారం ఏర్పడింది. గ్రహణం సమయంలో చంద్రుడు ఎప్పుడూ కనపడే రంగులోనే ఉంటాడు. కానీ, ఈ బ్లడ్ మూన్ సమయంలో మాత్రం చంద్రుడు పూర్తిగా ఎరుపు లేదా నారింజ రంగులో వచ్చి కనువిందు చేస్తాడు. సూర్యుడి నుంచి వచ్చే ఎరుపు లేదా నారింజ కిరణాలు భూమిపై నుంచి ప్రయాణం చేసి చంద్రుడి వర్ణాన్ని మారుస్తాయి. ఇలా శుక్రవారం సాయంత్రం ఎరుపు రంగులో చంద్రుడు కనువిందు చేశాడు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

ఆధ్యాత్మిక సిరి




సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవానికి ముహూర్తం ఖరారుతో పాటు స్వామివారి దోలోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఇన్‌చార్జి ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలోని ఇసుకకొండ(బాబాజికొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం పౌర్ణమి వేళ శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది.

8లో

ఉక్కు ఎస్‌ఎంఎస్‌లో ప్రమాదం

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)–2 విభాగంలో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ ఉద్యోగికి గాయాలయ్యాయి. కార్మిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎంఎస్–2 విభాగం కన్వర్టర్స్‌లోని హాట్‌మెటల్ చెక్ చేసే సమయంలో ఒక్కసారిగా స్లాగ్ బయటకు తుళ్లింది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బలిరెడ్డి పెంటయ్యపై స్లాగ్ పడటంతో గాయపడ్డాడు. బాధితుడిని ఉక్కు జనరల్ ఆస్పత్రికి చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

హెచ్‌ఎస్‌ఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా కిరణ్



సింథియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ నూతన డైరెక్టర్‌గా కిరణ్ సణికరాలా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1997లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా అర్హత సాధించిన ఆయన 1998లో ఆర్ఐఎన్ఎల్‌లో చేరి కార్పొరేట్ ఖాతాలు, ట్రెజరీ, ప్రాజెక్ట్ ఫైనాన్స్, బడ్జెట్, ఇంటర్నెల్ ఆడిట్ వంటి రంగాల్లో కార్యకలాపాలను నిర్వహించారు. ఆర్ఐఎన్ఎల్ ఐపోపీ నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ అవార్డును కూడా గెలుచుకున్నారు. హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఫైనాన్స్ అండ్ కమర్షియల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేశారు.

నేడు ఎఫ్‌టీపీసీ ఇండియా సిటిజన్ ఫోర్స్ పురస్కారాలు

డాబాగార్డెన్స్: సాంకేతిక, సామాజిక, సేవా, సినీ–సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన దిగ్గజాలకు ఎఫ్‌టీపీసీ ఇండియా, సిటిజన్ ఫోర్స్ ఎక్సలెన్స్, సిటిజన్ ఫోర్స్ లారెట్ అవార్డులు అందజేయనుందని సిటిజన్ ఫోర్స్ వ్యవస్థాపక చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రమేష్‌బాబు, ఎఫ్‌టీపీసీ ఇండియా అధ్యక్షుడు చైతన్య జంగా, కార్యదర్శి విజయ్‌వర్మ పాకలపాటి తెలిపారు. జాతీయ పురస్కారాలకు సంబంధించి శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో బాలీవుడ్ నటి నైనా గంగూలీ, థియేటర్ ఆర్టిస్ట్ ప్రీతా ముజెందార్, బిగ్ బాస్ ఫేమ్ షాని సల్మాన్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా వేదికగా శనివారం సాయంత్రం 6 నుంచి ఈ వేడుక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రేజీ స్టార్ ముంతాజ్ సర్కార్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారని తెలిపారు.

ఫిర్యాదు చేస్తే 90 రోజుల్లో పరిష్కారం

- చట్టాలపై అవగాహనతో మోసాలకు చెక్
- ఈ–జాగృతితో మరింత వెసులుబాటు
- జిల్లా వినియోగదారుల ఫోరం–1 ప్రెసిడెంట్ తనూజరెడ్డి



సాక్షి, విశాఖపట్నం: చట్టాలపై ప్రజలు అవగాహన పొందడం ద్వారా మోసపోకుండా ఉండవచ్చని జిల్లా వినియోగదారుల ఫోరం–1 ప్రెసిడెంట్ జి.తనూజరెడ్డి అన్నారు. వస్తు సేవలు, నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణాలు, ఇలా ఎందులో మోసం జరిగిందని భావించినా.. నిరభ్యంతరంగా జిల్లా వినియోగదారుల మండలిని ఆశ్రయించవచ్చని సూచించారు. ఎవరైనా.. ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసే సాంకేతికత ఈ–జాగృతి పేరుతో అందుబాటులోకి వస్తోందని వెల్లడించారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో పలు అంశాలపై ఆమె మాట్లాడారు.

ఫిర్యాదు చేయడం ఎలా అంటే.?

వినియోగదారుల మండలికి ఫిర్యాదు చేసి విధానం చాలా సులువు. తెల్ల కాగితంపై ఫిర్యాదు వివరాలు రాసి పంపవచ్చు. ఏ న్యాయవాది అవసరం లేకుండా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. మీరెలా మోసపోయారో చెబితే అంతా వారే సహకారం అందిస్తారు. అన్ని రకాల వస్తువులపై ఫిర్యాదు చేసే హక్కు వినియోగదారులకు ఉంది. లోపాలు, ఇబ్బందులు తలెత్తితే వస్తువు కొన్న రెండేళ్ల లోపు ఫిర్యాదు చేయాలి. ఆలస్యమైతే పూర్తి ఆధారాలతో డిలే పిటిషన్ వేయవచ్చు. ప్రతివాది సంస్థ నోటీసులు అందిన 45 రోజుల్లో కౌంటర్ ఫైల్ చేయకపోతే.. తదుపరి ప్రొసీడింగ్స్ లేకుండానే కేసు పరిష్కృతమయ్యే అవకాశం ఉంది.

బిల్లు తప్పకుండా తీసుకోవాలి

వినియోగదారుడు ఏదైనా వస్తువును కొన్న తర్వాత బిల్లు తప్పకుండా తీసుకోవాలి. ఇదే ప్రాథమిక ఆధారం. అప్పుడే కేసు స్వీకరించేందుకు అవకాశం ఉంటుంది. వస్తు సేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా పరిహారం పొందవచ్చు. రూ.5లక్షల లోపు వస్తువు ధర ఉంటే ఎలాంటి రుసుం లేకుండా వినియోగదారుల ఫోరం(కోర్టు)లో కేసులు వేయవచ్చు. రూ.5 లక్షలపైబడి ఉంటే.. రూ.400 నుంచి రూ.2 వేల వరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ప్రతి నెలా 30 నుంచి 40 ఫిర్యాదులు

ప్రతి నెలా 30 నుంచి 40 ఫిర్యాదులొస్తుంటాయి. ఇందులో టూ వీలర్, ఫోర్ వీలర్, వాటర్ ఫిల్టర్, గ్యాస్, పెట్రోల్ దుకాణాలు, ధరల వ్యత్యాసం, బీమా, వైద్యం వంటివి ఎక్కువగా ఉంటాయి. వచ్చిన ఫిర్యాదుల్లో బీమా కంపెనీల మోసాలపై 50 శాతం వరకు.. మోటర్ వాహనాలపై 30 శాతం ఉంటున్నాయి. ప్రస్తుతం వస్తున్న ఫిర్యాదుల్లో న్యాయవాది సాయంతో వస్తున్న ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి.

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం

పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. 90 రోజుల్లో పరిష్కృతమై వినియోగదారుడికి పరిహారం అందించగలుగుతున్నాం. కొన్ని కేసులు మాత్రం ఎక్కువ సమయం పడుతున్నాయి. ప్రతి నెలా 30 కిపైగా కేసులు పరిష్కరిస్తున్నాం. ప్రస్తుతం 190 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

పరిధి లేదు.. ఫిర్యాదు చేయవచ్చు

ఒకప్పుడు ఎక్కడ వస్తువు కొనుగోలు చేస్తే ఆ పరిధిలోనే ఫిర్యాదు చేసేవారు. చట్టంలో వచ్చిన మార్పులు వినియోగదారుడికి వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఎవరు ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చు. త్వరలోనే ఈ–జాగృతి అమల్లోకి రానుంది. అంటే పేపర్‌లెస్ విధానం. ప్రొసీడింగ్స్ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటాయి.

భయపడకుండా రావాలి

అన్యాయమైన వాణిజ్య విధానాలు, మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందడం వినియోగదారుల హక్కు. జిల్లా వినియోగదారుల ఫోరం ద్వారా నష్ట పరిహారం రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు, రాష్ట్ర కమిషన్ ద్వారా రూ. కోటి నుంచి రూ. 10 కోట్ల వరకు పొందవచ్చు. రూ.10 కోట్లు దాటితే జాతీయ వినియోగదారుల కమిషన్‌లో కేసులు వేసుకునే అవకాశం ఉంటుంది. మోసం జరిగిందని గుర్తిస్తే ప్రతి ఒక్కరూ భయపడకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని కోరుతున్నాం.

మోసపోయారా? మేం పోరాడతాం

- వినియోగదారుడికి అండగా ఉన్నాం
- ఏడేళ్ల కాలంలో విశాఖలో 86 కేసులు ఫైల్ చేశాం
- 90శాతం కేసుల్లో పరిహారం అందించగలిగాం
- వినియోగదారుల హక్కుల మండలి జాతీయ అధ్యక్షుడు డా.వికాస్‌పాండే



సాక్షి, విశాఖపట్నం: వస్తు సేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం–1986 ప్రకారం బాధితుల తరఫున పోరాడేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని వినియోగదారుల హక్కుల మండలి జాతీయ అధ్యక్షుడు డా.వికాస్ పాండే తెలిపారు. కన్స్యూమర్ రైట్స్ డే సందర్భంగా నగరంలో పలు వ్యాపార సముదాయాలు, దుకాణాల్లో మండలి తరఫున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు.

13 ఏళ్లుగా పోరాడుతున్నాం

వినియోగదారుడి సమస్య.. మండలి సమస్యగా భావించి 13 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. చట్ట ప్రకారం ఏ ఒక్క వినియోగదారుడు మోసపోకూడదు. దేశ వ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో మండలి తరఫున కేసులు వేస్తూ న్యాయం కోసం పోరాడుతున్నాం. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వినియోగదారుడు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ఎలాంటి ఫీజులు తీసుకోకుండా కేసు గెలిచేంత వరకు అండగా ఉంటాం.

దేశ వ్యాప్తంగా 300 కేసుల ఫైలింగ్

మా మండలి తరఫున దేశ వ్యాప్తంగా గడిచిన ఐదేళ్లలో 300కిపైగా కేసులు వేశాం. విశాఖలో 86 కేసులు నమోదు చేశాం. ఈ ఏడాది ఇప్పటి వరకు విశాఖ జిల్లాలో 7 కేసులు ఫైల్ చేశాం. దాదాపు 90 శాతం కేసుల్లో విజయం సాధించాం. 6–7 నెలల్లో మిగిలిన కేసులు కూడా పరిష్కారం కానున్నాయి.

సైబర్ నేరాలపైనా పోరాటం..

ఇప్పుడు సైబర్ నేరాలు రాజ్యమేలుతున్నాయి. అందుకే వాటిపైనా దృష్టిసారించాం. బ్యాంకుల పేరుతో మోసాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో విశాఖలో ఎస్ సెక్యూరిటీస్ పేరుతో నకిలీ యాప్ ద్వారా హరికుమార్ అనే వ్యక్తి రూ.15 లక్షలు నష్టపోయారు. కొటక్ సెక్యూరిటీస్ పేరుతో వెంకటరమణ అనే వ్యక్తి రూ.15 లక్షలు పోగొట్టుకున్నారు. దీనిపైనా కేసులు ఫైల్ చేశాం. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

చట్టం ఎంతో ఉపయోగపడుతుంది

వినియోగదారుల హక్కుల చట్టం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజలు దీనిపై అవగాహన పెంచుకోవాలి. ఎవరికి ఏ మోసం జరిగినా మండలిని ఆశ్రయిస్తే.. పరిష్కారం చూపుతాం. చట్టం విలువ అందరికీ తెలియజెప్పేందుకు దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

అప్పన్న పెళ్లికి ముహూర్తం ఖరారు

- ఈ నెల 30న ఉగాది రోజు పెళ్లిరాట
- ఏప్రిల్ 8న వార్షిక కల్యాణోత్సవం
- ఉద్యానవన మండపంలో ఘనంగా డోలోత్సవం
- శాస్త్రోక్తంగా వసంతాల సమర్పణ



స్వామికి పెళ్లి కుదిరిన ఆనందంలో భక్తులపై రంగులు చల్లుతున్న పురోహిత్ అలంకారి



స్వామికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహాచలంపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవానికి ముహూర్తం ఖరారైంది. వివాహం కోసం శుక్రవారం సింహగిరి నుంచి కొండ దిగువకు వచ్చిన స్వామి.. పిల్లనివ్వమని తన సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని కోరారు. ఏం చూసి నీకు పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన అమ్మవారు.. ఆ తర్వాత స్వామి వైభవాన్ని, ఆయనకున్న అసంఖ్యాకమైన భక్తజనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. చివరకు పిల్లనివ్వడానికి అమ్మవారు అంగీకరించారు. దీంతో ఈ నెల 30న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, వచ్చే నెల 8వ తేదీ చైత్ర శుద్ధ ఏకాదశి నాడు స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సింహగిరిపై పెళ్లి సందడి నెలకొంది.

ఘనంగా డోలోత్సవం

ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం ఘనంగా జరిగింది. ఏటా చైత్రశుద్ధ ఏకాదశి రోజున స్వామికి జరిగే వార్షిక కల్యాణోత్సవానికి ముందు వచ్చే ఫాల్గుణ పౌర్ణమి రోజు అడవివరంలో స్వామికి డోలోత్సవం విశేషంగా నిర్వహించడం ఆనవాయితీ. తనకు పిల్లనివ్వాలంటూ తన సోదరి అయిన పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించే విధానాన్నే అడవివరం గ్రామస్తులు బొట్టెనడిగే పున్నమి ఉత్సవం(డోలోత్సవం)గా అభివర్ణిస్తారు. కాగా.. కొండదిగువ పుష్కరిణి ఉద్యానవన మండపంలో ఈ ఉత్సవాన్ని దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి అయిన గోవిందరాజస్వామిని విశేషంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరిపై నుంచి పల్లకీలో మెట్లమార్గం ద్వారా తొలిపావంచా వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్వామికి దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు, అధికారులు, గ్రామస్తులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామిని ఊరేగింపుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులు పట్టారు.

అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి ఉద్యానవన మండపంలో ఏర్పాటు చేసిన డోలీపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. చూర్ణోత్సవం, వసంతోత్సం నిర్వహించారు. పూజలు చేసిన వసంతాలను స్వామికి సమర్పించారు. అనంతరం నాళాయిర దివ్య ప్రబంధాన్ని ఆలపిస్తూ డోలోత్సవం నిర్వహించారు. తదుపరి స్వామికి సమర్పించిన వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. స్వామికి పెళ్లికుదిరిన ఆనందంలో భక్తులు, దేవస్థానం ఉద్యోగులు ఒకరిపై ఒకరు వసంతాలను జల్లుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు. అనంతరం భక్తులకు పానకాన్ని ప్రసాదంగా అందజేశారు. తర్వాత అడవివరంలో తిరువీధి నిర్వహించారు. పెళ్లికొడుకు అలంకరణలో తమ ఇంటి ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు మంగళ హారతులిచ్చారు. తదుపరి స్వామిని మరల పైడితల్లి ఆలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి సింహగిరికి చేర్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఇన్‌చార్జి ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, డిప్యూటీ ఈవో రాధ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

ముగ్గురి మధ్య ఘర్షణ.. ఒకరికి కత్తిపోట్లు



చికిత్స పొందుతున్న ఏకాంత్ రెడ్డి

కూర్మన్నపాలెం: గాజువాక శివారు 77వ వార్డు మద్దివానిపాలెంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు ప్రస్తుతం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి.. మద్దివానిపాలేనికి చెందిన వివాహిత మద్ది వెంకటలక్ష్మిని అదే గ్రామానికి చెందిన కర్రి సతీష్‌రెడ్డి కొంత కాలంగా వేధిస్తున్నాడనే పుకార్లు గ్రామంలో వ్యాపించాయి. వెంకటలక్ష్మి భర్త పైడి రెడ్డి విదేశాల నుంచి ఇటీవల తిరిగి వచ్చాడు. ఆనోట.. ఈనోట ఈ విషయం విన్న పైడి రెడ్డి.. వరసకు తమ్ముడైన మద్ది అప్పలరాజు (రాజు)కు తెలియజేశాడు. దీంతో శుక్రవారం ఉదయం గ్రామంలో సతీష్ రెడ్డిని రాజు నిలదీశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి అది కొట్లాటకు దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న సతీష్‌రెడ్డి తమ్ముడు ఏకాంత్ రెడ్డి అక్కడికి చేరుకున్నాడు. అనంతరం ముగ్గురి మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఆవేశంతో ఊగిపోయిన రాజు, తన వద్ద ఉన్న కత్తితో ఏకాంత్ రెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఏకాంత్ రెడ్డి తల, చేయి, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఏకాంత్ రెడ్డి చికిత్స పొందుతున్నాడని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి రాజును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కాగా.. అనుమానం ఎంతటి ఘోరానికైనా దారి తీస్తుందనడానికి ఈ సంఘటనే నిదర్శనమని స్థానికులు చర్చించుకున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల ప్రకటన అవాస్తవం

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం : సింహాచలం దేవస్థానం ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని.. వాట్సాప్, సోషల్ మీడియా గ్రూపుల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు తెలిపారు. కొన్నిరోజులుగా వాట్సాప్, సోషల్ మీడియా గ్రూపుల్లో సింహాచలం దేవస్థానంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం సంప్రదించాలని ప్రచారం జరుగుతున్న విషయంపై శుక్రవారం దేవస్థానం ఈవో స్పందించారు. దేవస్థానం ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని, తప్పుడు ప్రకటనలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని స్పష్టం చేశారు.

ఒకే ప్లాట్ పలువురికి అమ్మిన ఘనులు

- ఏడుగురికి జైలు శిక్ష
- రూ.18.60 లక్షల జరిమానా

విశాఖ లీగల్: ఆస్తి విషయంలో ఒక వ్యక్తిని మోసం చేసిన ఏడుగురికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.18.60 లక్షల జరిమానా విధిస్తూ నగరంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం కమ్ 11వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.సత్యదేవి తీర్పు వెలువరించారు. పెందుర్తి పోలీస్ అధికారులు శుక్రవారం తెలిపిన వివరాలివి.. వైఎస్సార్ జిల్లా బిట్రగుంట మండలం బిట్రగుంట గ్రామానికి చెందిన పి.అప్పలరాజు 2014లో స్థలం కొనుగోలు చేయాలని భావించి పలువురిని సంప్రదించారు. దీనిని అవకాశంగా తీసుకున్న పిల్ల అర్జున్ మరో తొమ్మిది మందితో కలిసి మోసపూరితంగా కుట్ర పన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 158.88 చదరపు గజాల స్థలం కొనుగోలుకు అప్పలరాజు నుంచి రూ.18 లక్షలు వసూలు చేశారు. అయితే అదే స్థలాన్ని వేరే వారికి కూడా విక్రయించినట్లు 2017 ఫిబ్రవరిలో అప్పలరాజు గుర్తించి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులు పిల్ల అర్జున్, కె.అంజలిరావు, ఎం.పెద్ద అప్పలరాజు, ఎం.మరిడయ్య, ఎం.రమణ, ఎం.గోవింద్, ఎం.రాంబాబు, ఎం.చిన్న మరిడయ్య, ఎం.సూరిబాబు, ఎం.అప్పలరాజులపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 120తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ జరుగుతుండగా పిల్ల అర్జున్, ఎం.పెద్ద అప్పలరాజు, ఎం.అప్పలరాజు మృతి చెందారు. మిగిలిన ఏడుగురు నిందితులకు న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.18.60 లక్షల జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని బాధితుడు అప్పలరాజుకు చెల్లించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు.

అట్టహాసంగా జాతీయ నాటకోత్సవాలు ప్రారంభం



మా ఇంట్లో మహాభారతం నాటికలో ఓ సన్నివేశం

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని వేములపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జాతీయస్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రదర్శించిన నాటికల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారాలు పొందిన రంగస్థల నటులు తమ నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ముందుగా గుంటూరు అభినయ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' యువతను ఆలోచింపజేసింది. నేటి యువత జీవితంలో స్థిరత్వం లేకుండా ప్రేమ, పెళ్లి మోజులో పడటం, అనంతరం జీవితంలో వారికి ఎదురయ్యే పరిణామాలు, వారి కష్టాలను కళ్లకు కట్టినట్లు నటీనటులు ప్రదర్శించారు. 'వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి అందరూ డబ్బు మోజులో సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగాల్లోకి వెళ్లిపోతే రానున్న కాలంలో రైతులనేవారు కనిపించరు. దీని వల్ల తిండి కొరత ఏర్పడితే మానవ మనుగడ పరిస్థితి ఏమిటి?' అనే సందేశాత్మక అంశంతో చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ నటులు 'మా ఇంట్లో మహా భారతం' నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు జనరల్ బోగీల్లో ఉన్న ప్రయాణికుల గురించి ఎవరూ పట్టించుకోరు. ఒక రైలు ప్రమాదం సమయంలో జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న తన కొడుకు ఆచూకీ తెలియక ఒక తల్లి అనుభవించే ఆవేదనను తెలిపే 'జనరల్ బోగీలు' నాటికను కొలకలూరు సాయి ఆర్ట్స్ బృందం ప్రదర్శించింది. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఆర్‌సీ–5 యు. శుభ, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి సహకరించారు. శనివారం సాయంత్రం 6.15కు ఒంగోలు పండు క్రియేషన్స్ వారిచే 'పక్కింటి మొగుడు', రాత్రి 8.15 గంటలకు విశాఖ జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ మహిళలచే 'సంకల్పం' నాటికల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఇసుకకొండకు పౌర్ణమి తాకిడి



స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

డాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వేకువజాము 3 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సొంత గనుల కోసం కార్మికుల పోరాటం

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా ధర్నా, మానవహారం



జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం మహా ధర్నా చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా గురజాడ అప్పారావు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, గాజువాకలో తలపెట్టిన ధర్నాకు పోలీసులు అడ్డుపడి నాయకులను అక్రమంగా నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తొలగించిన సుమారు 400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఆఫీసర్లు, శాశ్వత ఉద్యోగులకు మూడు నెలల బకాయి జీతాలు విడుదల చేయాలని, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఉద్యమాలు నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకుడు జె.అయోధ్యరామ్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, నాయకులు వై.రాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, పి.మణి, కె.ఎం.కుమార మంగళం, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, ఐఎన్‌టీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహమాన్, జె.డి.నాయుడు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

- బంధువులు, కార్మిక సంఘాల ఆందోళన



ట్రాక్టర్ నడుపుతూ కుప్పకూలిన వెంకటరమణ

కూర్మన్నపాలెం : విధులు నిర్వహిస్తూ ఉక్కు కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. వివరాలివి. పెదగంట్యాడ దరి ముసలినాయుడుపాలెంలో నివాసం ఉంటున్న వేపాడ సూర్యవెంకటరమణ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టర్ వద్ద ట్రాక్టర్ డైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యథావిధిగా శుక్రవారం విధులకు హాజరై జోన్ ఎంఎంజెడ్‌లో ట్రాక్టర్‌ను నడుపుతుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో సహచర కార్మికులు వైద్యులకు సమాచారం అందించి రప్పించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బంధువులు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో ఉక్కు ప్రధాన ద్వారం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. బంధువులకు కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. అదే సమయంలో అంబులెన్స్‌లో మృతదేహం ఉక్కు ప్రధాన గేటు వద్దకు చేరుకుంది. దీంతో అంబులెన్స్‌ను కదలనీయకుండా బంధువులు, కార్మికులు ఆందోళన చేశారు. కాంట్రాక్టర్, బంధువులతో పోలీసులు, యూనియన్ నేతలు చర్చలు జరిపారు. మృతుని బంధువులకు పరిహారం కింద రూ.2 లక్షలు, మట్టి ఖర్చుల నిమిత్తం మరో రూ.30 వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదరడంతో ఆందోళకారులు శాంతించారు. మృతదేహాన్ని సొంత గ్రామమైన చోడవరం ప్రాంతానికి బంధువులు తీసుకువెళ్లారు.

వైభవంగా గౌర పూర్ణిమ ఉత్సవాలు



పుష్పాలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది : బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శుక్రవారం గౌర పూర్ణిమ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణభగవానుని భక్త అవతారమైన శ్రీ చైతన్య మహా ప్రభు ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహించిన ఈ ఉత్సవాలు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యాయి. శ్రీ కృష్ణుని భజన సంకీర్తనలు, పుష్పాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చైతన్య లీలల్లో ఒకటైన చాంద్‌కాజీ ఉద్ధరణ నాటకం అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని, వంశీకృష్ణ ప్రభు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువు జయంతి ఉత్సవాలు



పుష్పాభిషేకం చేస్తున్న వేదపండితులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీగౌర పూర్ణిమ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ భక్తులు ముందుగా శ్రీకృష్ణబలరాముల విగ్రహాలకు, అనంతరం శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువుకు పంచామృతాలు, పంచగంధ్య, సువాసనలతో కూడిన పుష్పాలు, వివిధ పండ్ల రసాలతో మహా అభిషేకం నిర్వహించారు. స్వామి వారికి విశేషంగా పిండి వంటలతో నైవేద్యం పెట్టి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేడుకలను అంబరీష దాస పర్యవేక్షించారు. అనంతరం హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్క్రించిన భక్తదాస గౌరలీల గురించి ప్రవచించారు.